క్లుప్తంగా

పోరాటంతోనే వేతనాలు పెంపు



మిఠాయిలు పంచుతున్న కార్మికులు

కడెం: సీఐటీయూ పోరాటంతోనే ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట కార్మికులు మిఠాయిలు పంచుకొని హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ కార్మికుల వేతనాలను మూడు వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని, అలాగే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి పనులు ప్రారంభం

కుంటాల: ఉపాధిహామీ పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గల్లపురం లక్ష్మీరమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని విఠపూర్ గ్రామంలో ఉపాధిహామీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి కవిత, టీఏ మాధురి, ఎఫ్ఏ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు తొలగింపు



దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియం ముందు, పాతబస్టాండ్‌లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలను బుధవారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ మాట్లాడారు. పట్టణ సీఐ మల్లేశ్ ఆదేశాల మేరకు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దుకాణాలను తొలగించినట్లు తెలిపారు. రోడ్డుపై తోపుడుబండ్లు, దుకాణాలు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఏర్పడి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్‌లు

మామడ: పంచాయతీలకు రావాల్సిన నిధులను సకాలంలో అందిస్తామని ప్రకటించినందున బుధవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి మండలంలోని సర్పంచులు క్షీరాభిషేకం చేశారు. సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు భూమేశ్వర్, సర్పంచ్‌లు శ్రీకాంత్‌రెడ్డి, కిచ్యానాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం పలు అభివృద్ధి పనుల విషయమై మండల ప్రజాప్రతినిధులతో చర్చా గోష్టి కార్యక్రమం నిర్వహించారు. త్వరలో ఖానాపూర్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో పలు అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అజ్మీరా అక్షిత్, రాజగంగన్న, అంకం రాజేందర్, పుప్పాల శంకర్, ఆకుల వెంకాగౌడ్, రామునాయక్, మోహిద్, వాల్‌సింగ్, శ్రీనివాస్, వెంకటరాజు, శేఖర్, గోపాల్, తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న శ్యాంసుందర్

లోకేశ్వరం: ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. బుధవారం రూ.1.12 కోట్లతో చేపట్టే లోకేశ్వరం–బామ్ని(కే) బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ డీఈ కొండయ్య, ఏఈ రఘు, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, నగర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, గడ్‌చాంద సర్పంచ్ వెంకట్‌రావు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ రైతువేదికలో బుధవారం వడ్యాల్, లక్ష్మణచాంద క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు వివిధ అంశాలపై ఒకరోజు పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ రాము శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహార లోపంతో బాధపడే శిశువును గుర్తించే విధానం, చిన్నారులకు అందించే ఆహారం వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యవతి, ప్రసూన కుమారి, అంగన్‌వాడీ టీచర్లు లలిత, భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, పద్మ, లావణ్య, సుజాత, రాజమణి, విజయ, సునీత పాల్గొన్నారు

గురుకులం భద్రమేనా?

- పాఠశాల పరిధిలో మూడు కెమెరాలు
- రెండు మాత్రమే పని చేస్తున్న వైనం
- ఆందోళనలో విద్యార్థినుల తల్లిదండ్రులు
- భవనం వెనుకవైపు ప్రహరీకి కన్నం



పడిన గోడ నుంచి నడిచి వెళ్లినట్లు ఆనవాళ్లు



జామ్ గురుకుల పాఠశాల భవనం

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామ సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకులంలో సరైన భద్రత లేదని పలువురు చర్చించుకుంటున్నారు. గతంలో ఓ ఆగంతకుడు పాఠశాలలో చొరబడి పరిసరాలు కలియతిరిగినా ఎవరూ గుర్తించకపోవడంతో విద్యార్థుల భద్రతపై అనుమానం మరింత బలపడింది.

రెండే సీసీ కెమెరాలు..

ఈ గురుకులంలో (ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు) 620 మంది విద్యార్థులు, బోధన సిబ్బంది 44 మంది, బోధనేతర సిబ్బంది 18 మంది పని చేస్తున్నారు. ఇంత పెద్ద గురుకులంలో కేవలం రెండు సీసీ కెమెరాలు (మైదానం వద్ద, ప్రధాన గేటు వద్ద) మాత్రమే పని చేస్తున్నాయి. వసతిగృహం వద్ద ఏర్పాటు చేసిన మరో సీసీ కెమెరా పని చేయడం లేదు. దీంతో ఇటీవల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థిని మహిత ఆకస్మిక మరణం వెనుక కారణాలు తెలియరాలేదు. బాధిత కుటుంబీకులు ప్రశ్నించినప్పటికీ పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు లేకపోవడంతో వివరాలు బయటకు రాలేదు. దీంతో మిగతా విద్యార్థినుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ప్రహరీకి మరమ్మతులేవి?

ఇక గురుకులం భవనం వెనుక వైపు వంటశాలకు దగ్గర్లోనే ఉన్న ప్రహరీకి కన్నం ఏర్పడి కొంతభాగం కూలిపోయింది. ఈ దారినే ఆగంతకుడు లోనికి వచ్చి..వెళ్లినట్లు ఆనవాళ్లు సైతం ఏర్పడ్డాయి. కాని ఇప్పటికీ దానికి మరమ్మతులు చేయించలేదు. అసలు ఈదారిలో ఎవరు రాకపోకలు సాగించారు. ఎందుకు దానిని మూసివేయించలేదో పాఠశాల సిబ్బందికే తెలియాలి.

రక్షణ చర్యలు తీసుకోవాలి..

620 మంది విద్యార్థినులున్న ఈ గురుకులంలో కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ఆపద ముంచుకొస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ప్రహరీ సైతం అక్కడక్కడా కూలేందుకు సిద్ధంగా ఉంది. గతంలో గాలివాన బీభత్సానికి పలుచోట్ల ప్రహరీ గోడ కూలింది. అధికారులు స్పందించి గురుకులంలో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు దెబ్బతిన్న ప్రహరీని మళ్లీ నిర్మించాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆందోళన చెందవద్దు

గురుకులం గేటు వద్ద రాత్రి ఇద్దరు, పొద్దంతా ఇద్దరు చొప్పున ఉండేలా వాచ్‌ఉమెన్‌లను నియమించాం. పాఠశాలలో మూడు సీసీ కెమెరాలుండగా రెండు పని చేస్తున్నాయి. పని చేయని కెమెరా విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దు. వారి రక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నాం.

– రమాకల్యాణి, గురుకులం ప్రిన్సిపాల్, జామ్

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా గుంత



భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాత్రి రాకపోకలు సాగించే పలువురు గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.
ప్రశ్నించాల్సిన అధికారి: ఉదయ్, పీఆర్ ఏఈ, ఫోన్:7207474442

గ్రామాల్లో కొనసాగుతున్న ‘కంటివెలుగు’

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. గత నెల 19న శిబిరం ప్రారంభం కాగా ఇప్పటివరకు 1700 మందికి కంటి పరీక్షలు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ పేర్కొన్నారు. 304 మందికి కళ్లద్దాలు అందించామన్నారు. మరో ఆరు రోజులు శిబిరం సాగుతుందని.. సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీకాంత్, శ్వేత, లక్ష్మణ్, యాస్మిన్, శివకృష్ణ, వనజ, సుగుణ, శారద తదితరులు పాల్గొన్నారు.

బావాపూర్‌లో శిబిరం ప్రారంభం

ఖానాపూర్: మండలంలోని బావాపూర్ తండాలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ వినీష్‌తోపాటు ఎంపీడీఓ మల్లేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్ తదితరులు ఉన్నారు.



కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఎంపీడీవో మల్లేశ్

అవగాహన ర్యాలీ..

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో బుధవారం కంటివెలుగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు గ్రామసభలో సర్పంచ్ కనీశ్ ఫాతిమా మాట్లాడుతూ అందరూ కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుమన్, ప్రధానోపాధ్యాయులు రాజేశ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుంటాల : ఓలాలో ర్యాలీ చేస్తున్న సర్పంచ్

ముధోల్: మండలంలోని బ్రహ్మణ్‌గావ్ గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని బుధవారం తహసీల్దార్ శ్యాంసుందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట సిబ్బంది సత్యనారాయణ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై నిర్లక్ష్యం వద్దు

- జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

కుంటాల: ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలపై సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండొద్దని జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధిహామీ, హరిత హారం, పల్లెప్రకృతి వనాల నిర్వహణపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలన్నారు. పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. అనంతరం అంబకంటితండాలో పల్లె ప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, పీఆర్ ఏఈ సూర్యతేజ, ఏపీవో నవీన్, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్

నూతన చట్టం రద్దు చేయాలి

కడెం: అటవీ చట్టం–2022ను రద్దు చేసి పోడు భూములకు పట్టాలివ్వాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సర్దార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నాయకులు, రైతులతో కలిసి తహసీల్దార్ గజానన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నర్సయ్య, లక్ష్మణ్, రాజేశ్, గంగన్న, ప్రసాద్ ఉన్నారు.

బలోపేతానికి కృషి చేయాలి

భైంసా: కులసంఘాలు తరచూ సమావేశమై బలోపేతానికి కృషి చేయాలని మున్నూరుకాపు సంఘం ముధోల్ తాలూక అధ్యక్షుడు రోళ్ల రమేశ్ అన్నారు. బుధవారం బాసరలోని సంఘ భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జంగం రమేశ్, ఉపాధ్యక్షుడు రావుల భోజన్న, కోశాధికారి సంజీవ్, తాలూకా సంఘం సహ కార్యదర్శి నర్సయ్య, మండలంలోని అన్ని గ్రామాల కార్యవర్గ సభ్యులున్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



చైర్మన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్.. పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతోపాటు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్‌లను బుధవారం హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారితో పలు అంశాలు చర్చించారు.

క్షేత్ర పర్యటనలో పాఠశాల విద్యార్థులు

ఖానాపూర్: క్షేత్రపర్యటనలో భాగంగా మండలంలోని బావాపూర్(కె) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం కడెం ప్రాజెక్టుతోపాటు పలు ప్రాంతాలను సందర్శించినట్లు ఉపాధ్యాయులు సుజాత, లక్ష్మణ్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆహ్లాదం పంచేందుకు ఈ పర్యటన చేపట్టామన్నారు.

చెక్‌డ్యాంలు, నీటికుంటలు పరిశీలన

నర్సాపూర్(జి): వనదర్శినిలో భాగంగా బుధవారం దిలావర్‌పూర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నర్సాపూర్(జి) అటవీ క్షేత్రంలో పర్యటించారు. ఈసందర్భంగా విద్యార్థులు అడవిలో తిరుగుతూ నర్సరీ, చెక్‌డ్యాం, జంతువులు, పలురకాల చెట్లు, నీటి కుంటలు పరిశీలించారు. అనంతరం కలిసి వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు వెన్నెల, అనుపమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కడెం ప్రాజెక్టు వద్ద బావాపూర్(కె) విద్యార్థులు

భాషాపండితులు, పీఈటీల నిరసన

తానూరు: తమకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని ఎల్వి, భోసి జిల్లా పరిషత్ పాఠశాలల్లో బుధవారం పలువురు భాషా పండితులు, పీఈటీలు నిరసన వ్యక్తం చేశారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు తెలుగు విద్యాబోధన నిలిపివేసినట్లు పేర్కొన్నారు. తెలుగు ఉపాధ్యాయురాలు గంగారాణి మాట్లాడుతూ తెలుగు, పీఈటీల ఐక్యవేదిక పిలుపు మేరకు నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు భూమన్నయాదవ్‌కు వినతిపత్రం అందజేశారు.

భైంసా: ప్రభుత్వం పండితులు, పీఈటీ పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈమేరకు బాసర మండలం కౌటజెడ్పీఎస్ఎస్ పాఠశాలలో భాషోపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.



ఎల్వి పాఠశాలలో వినతిపత్రం ఇస్తున్న టీచర్లు

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ముధోల్: మండల కేంద్రంలోని భవిత వనరుల కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కల్గిన ఆరుగురు విద్యార్థులకు తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంఈవో మైసాజీ ప్రత్యేక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంప్రోమెంట్ ఆఫ్ పర్సన్ (ఎన్ఐఈపీఐడీ) సికింద్రాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ కిట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు అఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, ఖలీద్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, స్నేహ, ఫిజియోథెరపిస్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



ఏర్పాటు చేయించిన నల్లా

సారంగాపూర్: మండలంలోని రవీంద్రనగర్‌లో ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులపై డిసెంబర్ 29న సాక్షిలో ‘గొంతు తడపని భగీరథ’ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశ్ ఆధ్వర్యంలో సిబ్బంది తాగునీటి ట్యాంకుకు, పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించారు. త్వరలో గ్రామస్తులకు పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

సమాచారం

11న ఆవిర్భావ సదస్సు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 11న బహుజన పొలిటికల్ సెంటర్ ఆవిర్భావ సదస్సు నిర్వహిస్తామని బహుజన కూలి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పసుపుల వెంకన్న బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భావ సారూప్యత కలిగిన వారంతా సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా సైద్ధాంతిక రాజకీయ అవగాహన ముసాయిదా పత్రం ప్రదర్శిస్తామని.. సదస్సుకు బహుజన మేధావులంతా హాజరవాలన్నారు.

11న సర్వసభ్య సమావేశం

మామడ: మామడ మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 11న ఎంపీపీ రాథోడ్ అమృత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రేపు ‘డబుల్’ఇళ్లపై గ్రామసభలు


ఖానాపూర్: పట్టణంలో కొద్దిరోజుల కిందట స్వీకరించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల దరఖాస్తుల విషయమై ఈనెల 10న గ్రామసభలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారుల్లో అర్హుల, అనర్హుల జాబితాను ఆయా వార్డుల్లో ప్రదర్శించడంతోపాటు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు గ్రామసభలకు శుక్రవారం హాజరవాలని కోరారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	25

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : మైఖేల్
నారాయణ : ధమాకా
వెంకటేష్ : వాల్తేరు వీరయ్య

ప్రారంభమైన ‘పునఃప్రతిష్ఠాపన’



ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న కాలనీవాసులు

నిర్మల్‌ఖిల్లాగేట్: జిల్లా కేంద్రంలోని నాయుడువాడ శ్రీ గుట్ట వీరన్న శివాలయ విగ్రహ పునఃప్రతిష్ఠాపన, శ్రీ శివ పంచాయితన యంత్ర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మి ది గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచన, రక్షాబ ంధనం, అంకురార్పణ, పంచగవ్య ప్రాశన, రు త్వికర్ణ, యాగశాల ప్రవేశ మండప ఆరాధన, అఖండ దీపారాధన, హారతి వంటి పూజలు నిర్వహించారు. యజ్ఞ బ్రహ్మ శ్రీ బాలాజీ ఆచార్యుల చేత రాతిపై చెక్కబడిన శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు, భక్తులు హారతులతో బయలుదేరి స్థానిక గాంధీచౌక్ హనుమాన్ ఆలయం నుంచి ఉత్సవమూర్తుల ప్రతిమలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం భక్తులకు హారతి, తీర్థప్రసాదం అందజేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

తానూరు: గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. నర్సరీ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. హరితహారంలో భాగంగా గతంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. అర్హులకు తప్పనిసరిగా జాబ్‌కార్డులు అందించి కూలీ పనుల కు వెళ్లేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



హాజరైన కార్యదర్శులు, సిబ్బంది

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి వీడీసీ చైర్మన్ అమృనాయక్ తండ్రి మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను బుధవారం రాత్రి టీజీవో జిల్లా అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్ పరామర్శించారు. అనంతరం కాశీరాంతండాకు చెందిన భూక్య ప్రేమ్ సాగర్ కుటుంబాన్ని పరామర్శించారు.